


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### దేవుడున్నాడు జాగ్రత్త!

**లైఫ్‌లో** ముప్పాతిక భాగం గడిచిపోయాక సడెన్‌గా జ్ఞానోదయం అయింది నిన్న. నా సినిమాలని డైరెక్ట్ చేసిన ముగ్గురు డైరెక్టర్‌లతో మాట్లాడాక.... నేనేం కోరుకున్నానూ... దేవుడేం చేస్తున్నాడూ. అసలున్నాడా? ఉంటే నా మాటలు వింటున్నాడా? అనే ఎరుక కలిగింది .. నిస్సందేహంగా వున్నాడు. ఎలా వున్నాడో. ఎలా నామాటలకు స్పందిస్తున్నాడో చెప్తా వినండి.

నేను చిన్నప్పటినుండీ ఏ గోల్ లేకుండా పెరిగినదాన్ని. ఏదో పెళ్ళీ, పిల్లలూ అన్నీ ఫ్లూక్‌లో జరిగిపోయాయి. ఇది ఇలాగే చెయ్యాలీ అనే గోల్.. చదువులో కానీ కళలలో కానీ, పర్సనల్ లైఫ్‌లో కానీ లేదు. అదేంటీ? చాలా మందితో పోల్చుకుంటే.. చాలానే చేసారుగా? ముప్పై నవలలూ, మూడొందొందలు కథలూ.. పదకొండు సినిమాలూ, 16 సీరియల్స్, 2 వెబ్ సిరీస్.. నేషనల్ అవార్డ్స్ జ్యూరీ మెంబరుగా, సెన్సార్ బోర్డ్ మెంబర్‌గా, స్టేట్ అవార్డులు పొందారు, జ్యూరీలో చేసారూ.. అని తెలిసిన వాళ్ళు అనచ్చు. కానీ అవన్నీ పెద్దగా గోల్ పెట్టుకుని చేసినవి కావు.

యూనివర్స్ ఇచ్చినవి. ఔను... ముమ్మాటికీ, దేవుడు అనేవాడు, లేదా మనం ఏ పేరు పెట్టుకుంటే ఆ శక్తి వుంది. మనం కోరే కోరికలనీ, అభిలాషలనీ తీరుస్తుంది .మీరు తప్పుగా కోరితే, దేవుడేం చెయ్యలేడు. టీచర్ మన ఆన్సర్ షీట్‌ని దిద్ది, మార్కులు ఇచ్చి పై క్లాస్‌కి పంపిస్తారు కానీ, ఆన్సర్‌ని మార్చి కరెక్ట్ చెయ్యరు కదా! దేవుడు కూడా అంతే. ఇందుకు నాకు తెలిసిన కొందరిని ఉదాహరణలుగా చెప్తాను. ఒక డైరెక్టర్. నావి రెండు సినిమాలు దర్శకత్వం చేసాడు. నేను అతని ప్రతిభని గొప్పగా చెప్పుకుంటాను. ఎందుకంటే అతను తీసిన చిత్రాలు అంత గొప్పవి. సినిమా చరిత్రలో శాశ్వతంగా గొప్ప సినిమాలుగా నిలిచిపోయినవి.. కానీ అతను రేస్‌లో ముందుకి వెళ్ళలేకపోయాడు. పెద్ద స్టార్స్‌తో పాన్ ఇండియా సినిమాలు

తియ్యలేదు. చాలా సంవత్సరాలుగా ఖాళీగా వున్నాడు కూడా. కానీ అతని లైఫ్ స్టైల్ చాలామది కుళ్ళుకునేలా వుంటుంది.. అఫ్‌కోర్స్ అతనికి డిపెండెంట్స్ లేరు. లక్షరూపాయలు అద్దె ఇచ్చి ఒక అత్యంత అధునాతనమైన ఇంట్లో వుంటాడు. రోజూ అతని సాయంత్రాలు మిత్రులతో విందులతో లైవ్లీగా గడుస్తాయి. పెద్ద చింతలేవీ లేవు. కులాసాగా రోజులు గడుపుతాడు.

అతనితో నిన్న మాట్లాడాను. దాదాపు ఇరవై ఏళ్ళుగా నాకు అతను బాగా మిత్రుడు అవడం మూలానా, అతని ఆలోచనలన్నీ నాతో పంచుకుంటాడు కాబట్టి నాకు తెలిసిందేవిటంటే యూనివర్స్‌ని అతను ఇలాంటి జీవితమే అడిగాడు తప్ప రేట్ రేస్‌లో పడికోట్లు సంపాదించి, నెంబర్ వన్ స్థానంలో వుండాలని కోరలేదు. దేవుడా నాకు చింతలేని సాయంత్రాలు ఇవ్వు. నా ఇష్టం వచ్చినప్పుడు నిద్రలేస్తాను. నా ఇష్టం వచ్చినప్పుడు ఫోన్ చేసి పనిమనిషిని పిలిచి క్లీనింగ్, కుకింగ్ చేయించుకుంటాను. లేదా రోజంతా పడుకుని ఈవెనింగ్ పార్టీలు చేసుకుంటాను. ఈ లైఫ్ నాకు ఇష్టం. అని కోరుకున్నాడు. ఇలా కోరుకున్నాను. నేను పీక్స్‌లో వున్నప్పుడు, రెండు హిట్స్ ఇచ్చి ఇండస్ట్రీలో నాపేరు మారు మ్రోగుతున్నప్పుడు అని అతను అనుకున్నాడో లేదో కూడా తెలీదు. కానీ.. అదే జరిగింది. అతని కోరికలు ఏవిటో నాతో చెప్పాడు కాబట్టి. ముఖ్యంగా బాదర బందీ లేని జీవితం పెళ్ళి అనేది చాలా సమస్యలకి ఆదిపాదం.. ఈ సబ్జెక్ట్ ఇప్పుడొద్దులెండి.

ఇంకో డైరెక్టర్ నేషనల్ అవార్డులూ, నంది అవార్డులూ వచ్చే సినిమాలు తీస్తాడు. నా సినిమా కూడా తీసాడు. ఆయన స్కూటర్ మీద ఫిలిం నగర్‌లో ఇప్పటికీ తిరుగుతాడు. చిన్న పరిశ్రమలూ, పెద్ద ఆలోచనలూ.. లెవెల్‌లో సమాజానికి చాలా పనికి వచ్చే, ఆలోచనాత్మకమైన సినిమాలు తీస్తారు. ఆయనతో కాసేపు మాట్లాడితేనే ఒక ఎడ్యుకేషన్ అనిపిస్తుంది ఎన్నో విషయాలలో. ఒకప్పుడు ఆయన జర్నలిస్ట్ కూడా. ఆయన ప్రతి ఏడూ ఒక సినిమా తీసి నేషనల్ అవార్డు కోసం పంపిస్తారు. సినిమాలో అంత 'దమ్ము' వుంటుంది. ఆయన ఆ దేవుడిని బహుశా! "నన్ను అను నిత్యం బిజీగా వుంచు.. ప్రతి ఏడూ ఒక సినిమా తీసేట్లు చూడు" అని కోరుకుని వుంటారు. వాటికి డబ్బు రావాలని కోరుకుని వుండరు. లేదా ఆ పార్ట్ కోరికలో మర్చిపోయి వుంటారు. ఇరవై రెండేళ్ళుగా ఆయనని ఇంతే బిజీగా నేను చూస్తున్నాను. ఎప్పుడు మాట్లాడినా "వచ్చే నెల సినిమా రిలీజ్ వుంది అమ్మా.. అనో, ఇంకోసినిమా ఫలానా సబ్జెక్ట్ మీద ప్లాన్ చేస్తున్నాను అనో.." అంటారు. అవి నిజం కూడా. కరోనా టైంలో కూడా ఆయన వలస మీద సినిమా తీసారు. ఆయన సినిమాలకి ఆయనే కథా, మాటలూ రాసుకుంటారు. నేను నంది అవార్డు జ్యూరీలో వున్నప్పుడు ఒక సినిమాలో మాటలకి ఎన్నిసార్లో లేచి నిలబడి జ్యూరీ సభ్యులం అందరం చప్పట్లు కొట్టాం. ఆయన పేరు ఇండస్ట్రీలో కమర్షియల్ నిర్మాతల కాంపౌండ్‌లో వినిపించదు. రామానాయుడు గారు మాత్రం ముక్కుకి గుడ్డలు, కరోనా రాక ముందే అమ్మాయలకి కట్టడం చూపించిన ఈయన ప్రతిభకి ముచ్చటపడి నా కథకి మా కాంబినేషన్‌లో ఓ సినిమా తీసారు. అది ఆడలేదు.

ఆయనతో మాట్లాడితే చాలా ప్రశ్నలకి జవాబులు దొరుకుతాయి నాకు. నిన్న ఈ దేవుడితో మనం చాలా జాగ్రత్తగా వుండాలనే టాపిక్ అలానే తెలిసింది.

'పెళ్ళి' అని కోడిరామక్రిష్ణగారు తీసిన సినిమాలో ఏక్ట్ చేసిన ప్రతి నాయకుడు పృధ్వీగారి గురించి ఆయన నిన్న చెప్పారు నాకు.

"ఈ దేవుడితో చాలా జాగ్రత్తగా వుండాలిసార్. సెంటెన్స్ అతి జాగ్రత్తగా ప్రిపేర్ చేసుకుని అడగాలి విష్.. నేను "నాకు ఒక్క హిట్ కావాలి దేవుడా" అని పదే పదే అడిగాను ఫ్రస్టేషన్‌తో.. ఆయన తథాస్తు అన్నాడు" అని చెప్పాడుట.

దేవుడి తప్పులేదు. అతను అడిగినట్టే 'ఒక్క' హిట్ ఇచ్చాడు.

ఇది విన్నాకా నేను నా మిత్రుల గురించీ, నా గురించీ ఆలోచిస్తే, ఎవరి మేనిఫెస్టేషన్‌లకి తగ్గట్టుగా దేవుడు వారి అభీష్టాలని సిద్ధింప చేసాడని అర్ధం అయింది.

నేను తమ్ముడు అని నేను పిలిచుకునే దర్శకుడు. ఇతనితో కూడా రెండు సినిమాలకి పని చేసాను. ఎప్పుడూ బిజీగా వుంటాడు. అతని పేరు నాటకాల జ్యూరీలలోకానీ, సినిమా ఇండస్ట్రీ ఫంక్షన్స్‌లో కానీ, అవార్డుల జ్యూరీలలో కానీ, నలుగురు మిత్రులు కలసినప్పుడు కానీ తప్పక వస్తుంది. అందరికీ తలలో నాలికలా వుంటాడు. పెద్ద హీరోల సినిమాలు డైరెక్ట్ చేసాడు.. మ్యూజికల్ హిట్స్ ఇచ్చాడు. అతను పెద్ద డైరెక్టర్లతో ఒకరిగా వున్నప్పుడు, నెమ్మదిగా స్వంత సినిమాలు తీసినప్పుడూ, నష్టపోయినప్పుడూ, మళ్ళీ పుంజుకుంటున్నప్పుడూ...

నేను చాలా దగ్గర కాబట్టి దగ్గరనుండి గమనిస్తూ వచ్చాను. అతను ప్రొద్దుట లేస్తే ఇంట్లో వాళ్ళకి దొరకడు. మనకి కూడా ఫోన్‌లో తప్ప అందుబాటులో వుండడు. బిజీగా రెండు దేశాల మధ్య తిరుగుతూ వుంటాడు. అందరికీ కావలసినవాడు అజాత శత్రువు. ఎవరోకాని ఇతని గురించి చెడుగా ఏమీ మాట్లాడడానికి లేదు. కానీ రైజ్‌లో వున్నప్పుడు ఇంకా కృషి చేసి పెద్ద హీరోల డేట్స్ సంపాదించాలని చూడకపోవడం ఎక్కువ సరైన పద్ధతిలో కెరీర్ ప్లాన్ చేసుకోకపోవడం అతని తప్పు అని కొందరు అంటారు. కానీ అది నిజం కాదు. అతను దేవుడ్ని "అందరూ నా గురించి మాట్లాడుకోవాలి. పొద్దుట లేస్తే ఇద్దరు ముగ్గురు నా గురించి వెయిట్ చేస్తూ వుండాలి" అని కోరుకున్నాడు. అదే దేవుడు తథాస్తు అన్నాడు. అతనూ హేపీ.. దేవుడూ హేపీ. బట్ డబ్బు అనేది మన కుటుంబ జీవితానికి చాలా అవసరం కాబట్టి, అదికూడా దేవుడ్ని అడగడం మర్చిపోకూడదు, అదే తప్పు ఇతనూ చేసాడు.

నేను కొణిదెల నాగుబాబుగారితో ఆయన సీరియల్‌కి వర్క్ చేసినప్పుడు ఆయన పదేపదే నా రచన నచ్చి పొగిడేవారు. నా వెనకాల కూడా నా ప్రతిభ గురించి మెచ్చుకుంటున్నారని కొందరు మిత్రులు చెప్పారు. ఆయన ఒకేమాట అనేవారు "మీరు డబ్బు సంపాదించాలని తీవ్రంగా కోరుకోవడం లేదు. గుర్తింపూ, గౌరవం మాత్రమే కోరుకుంటున్నారు. లేకపోతే మీ టాలెంట్‌కి మీరూ ఇప్పుడు బాగా సంపాదిస్తున్న మగ రచయితలతో సమానంగా సంపాదించేవారు" అని.

అక్షరాలా అది నిజం.

నేను మొదటి సినిమా నుండీ గౌరవం, గుర్తింపూ కోరుకున్నాను.

నేను సెట్‌కివెళ్తే, మానిటర్ ముందు డైరెక్టర్, నిర్మాతల పక్కన ఛైర్ వేసి కూర్చోపెట్టి రైటర్‌గా నా సజెషన్స్ అడిగేవారు.

ప్రెస్‌మీట్స్‌లో నేను బాగా మాట్లాడ్తానని మాట్లాడించేవారు. నా చీరలు బావుంటాయి అని కొందరు లేడీస్ ప్రెస్ మీట్ క్లిప్స్ నాకు పంపిస్తూ అభినందించేవారు. టి.వి సీరియల్ అయినా, సినిమా అయినా ఎంత ప్రముఖులైన నిర్మాతలైనా మా ఇంటికి వచ్చి, స్వయంగా వారి కార్లో నన్ను షూటింగ్ లొకేషన్స్‌కి తీసుకెళ్ళేవారు. అది స్టేట్ జ్యూరీ అయినా, సెన్సార్ బోర్డ్ అయినా, నేషనల్ జ్యూరీ అయినా నేను అందులో వుంటాను. ప్రముఖమైన రామానాయుడిగారి కాంపౌండ్, అల్లు అరవింద్‌గారి గీతా ఆర్ట్స్, రైటర్స్ అసోసియేషన్ ఏదైనా విమెన్ ప్రొటెక్షన్ సెల్‌కి ఛైర్‌పర్సన్‌గా నన్నే పెట్టుకున్నారు. ఎంతో గౌరవం. ఎంతో గుర్తింపూ ఇస్తారు. డబ్బులు సంగతి అడగకండి. ప్రతి సంవత్సరం స్క్రీన్ మీద నా పేరు పడుతుంది. కనీసం నేను పని చేసిన సినిమాలకి కృతజ్ఞతల కార్డ్ అయినా. నేషనల్ అవార్డ్‌తో సహా అన్నీ జ్యూరిల్లో. మరింకేం కావాలి లైఫ్‌లో? పెద్దగా చెడ్డగా నాగురించి అనుకునేవారు కూడా లేరు. కానీ నేను దేవుడ్ని "దేవుడా ఒక స్త్రీగా గౌరవం, కీర్తీ, గుర్తింపుతో బాటు సినిమా ఇండస్ట్రీలో డబ్బుకూడా పుష్కలంగా ఇవ్వు అని ప్రార్థించి వుండాల్సింది."

నా మేనిఫెస్టేషన్ ఏదైతే వుందో అది మాత్రం దేవుడు విన్నాడు... అదే ఇచ్చాడు.

“దేవుడితో జాగ్రత్తగా ఉండాలి. దేవుడ్ని కోరికలు కోరేటప్పుడు జాగ్రత్తగా కోరాలి.”

Post your comments







